## క్లుప్తంగా

### గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేసిన అయ్యంకి


వెంకటరమణయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సారథి తదితరులు

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** గ్రామాల్లో గ్రంథాలయాలు స్థాపించి, వాటి అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు అయ్యంకి వెంకటరమణయ్య అని హెల్త్ ఇన్‌స్పెక్టర్ డీవీ ఎస్వీ సారథి కొనియాడారు. బుధవారం స్థానిక ఇన్నీస్‌పేట శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఎస్వీ సారథి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. లైబ్రేరియన్ శ్రీదేవి మాట్లాడుతూ వెంకటరమణయ్య ఆంధ్రప్రదేశ్‌లో కొంకుదురు గ్రామంలో జన్మించారని, ఆంధ్ర భారతి గ్రంథాలయ సర్వస్వం పత్రికలను స్థాపించి జీవితాంతం గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేశారన్నారు. వారి కృషి ఫలితంగా 1972లో బరోడా మహారాజు అయ్యంకి వెంకటరమణయ్యను గ్రంథాలయ పితామహ అవార్డుతో సత్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

### వెంకటరమణారావు మృతికి సంతాపం

**కడియం:** నరసాపురం ఎంపీడీఓ మండవ వెంకటరమణారావు మృతికి పంచాయతీరాజ్ ఉద్యోగులు బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ మేరకు ఉద్యోగులు రెండు నిముషాలు మౌనం పాటించారు. ఎంపీడీవో ఆత్మహత్యకు కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు

### కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి న్యాయం జరగలేదు


బిల్డర్ బాబీ

**రాజమహేంద్రవరం సిటీ:** కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు సరైన న్యాయం జరగలేదని, ఇది అంకెల గారడీ బడ్జెట్ అని కాంగ్రెస్ జిల్లా యువజన అధ్యక్షుడు బిల్డర్ బాబీ బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాజధాని అమరావతికి కేటాయించిన రూ.15 వేల కోట్లు అప్పుగా ఇచ్చారా, సాయంగా ఇచ్చారా అనే విషయంలో స్పష్టత లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల ఊసే లేదని, ప్రత్యేక హోదా ప్రసక్తి లేదని ఇది ఏపీకి అన్యాయం చేయడమేనని తెలిపారు. ప్రతి బడ్జెట్‌లోను ఆంధ్రప్రదేశ్ ప్రజలను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మోసం చేస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇకనైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక హోదాపై ఒత్తిడి తీసుకురాలేకపోతే ప్రజలు క్షమించరని బిల్డర్ బాబీ హెచ్చరించారు.

### పాఠశాలకు కుర్చీల వితరణ


పాఠశాలకు అందజేసిన కుర్చీలు

**కంబాలచెరువు:** స్థానిక కోర్లమ్మపేటలోని కుసుమ నాగన్న మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థులు నక్కెళ్ల కాత్యాయని, గౌతమ్ కృష్ణల తండ్రి నక్కెళ్ల హరిప్రసాద్ 10 కుర్చీలను బహూకరించినట్టు ప్రధానోపాధ్యాయిని సేవా రాజ్యలక్ష్మి తెలిపారు. 35వ వార్డు మాజీ కార్పొరేటర్ కరగాని మాధవి చేతుల మీదుగా హెచ్ఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు కరగాని వేణు, ఇతర పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### కాటన్‌కు ఘన నివాళి


కాటన్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

**ధవళేశ్వరం:** సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక కాటన్ బ్యారేజ్ సెంటర్‌లో ఉన్న కాటన్ విగ్రహానికి గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చిన ఘనత సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడిదని కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాకా రమణ, కార్యాధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు, కేఎన్ గౌరీశంకర్, పుసులూరి శేషుకుమార్, మూడెడ్ల రమేష్, శ్రీరంగం శ్రీనివాసరావు, సత్యారావు, బొమ్మా రాములు, చిటికెన శ్రీకృష్ణ, ధర్నాల శ్రీనివాస్, వ్యాగ్రేశ్వరుడు, అరిసెల రాంబాబు, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# గోదారి వరద.. లంకల్లో దడ

- లంకల్లో మత్స్యకారుల అవస్థలు
- పునరావాస కేంద్రాలే ఆసరా


లంకగ్రామాల నుంచి ప్రజలను తరలిస్తున్న సిబ్బంది


భోజనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

**సీటీఆర్ఐ:** ఉభయ గోదావరి జిల్లాలలోని ప్రజలకు తాగు, సాగునీరు అందించే గోదావరి.. వరదల సమయంలో తన ఉగ్రరూపం చూపిస్తుంది. అప్పటి వరకూ ప్రశాంతంగా కనిపించే నది.. ఉరకలెత్తి ప్రవహిస్తూ కంగారు పుట్టిస్తుంది. వర్షాకాలం సీజన్ ప్రారంభం కాగానే గోదావరికి వరదలు వస్తాయి. ఇక తుపానులు, భారీవర్షాల సమయంలో ఎగువన భారీగా నీరు వచ్చి చేరడంతో ప్రవాహం మరింత పెరుగుతుంది. దీంతో పరీవాహన ప్రాంతంలోని అనేక పొలాలు, లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడతాయి.

**లంకల్లో జీవనం**

ప్రస్తుతం గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. నది మధ్యలో నగరానికి ఆనుకుని లంక గ్రామాలు ఉన్నాయి. వీటిలో మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గోదావరిలో చేపలు పట్టుకుని జీవించే వీరు వరద అంటే ఎంతో ఆందోళన చెందుతారు. నది నీటిమట్టం పెరగడంతో లంకల్లోని వీరి ఇళ్లు, ఇతర వస్తువులు మునిగిపోతాయి. దీంతో వరద పెరుగుతుండగానే అధికారులు వీరందరికీ నగరానికి తీసుకువచ్చి పునరావాసం కల్పిస్తారు. వరద తగ్గే వరకూ వారికి అన్ని సదుపాయాలు కల్పించి, ఆ తర్వాత లంకల్లో విడిచిపెడతారు. నగరానికి ఆనుకుని ఉన్న మూడు లంకల్లో దాదాపు 500 మంది మత్స్యకారులు జీవిస్తున్నారు.

**విద్యుత్ ఉండని గ్రామాలు**

లంక గ్రామాల్లో ఇళ్లకు విద్యుత్ ఉండదు. కేవలం సోలార్ సిస్టమ్‌పై ఆధారపడతారు. ఇక్కడ నివసిస్తున్న వారందరూ పూరి గుడిసెల్లోనే ఉంటారు. మగవారు చేపల వేటకి వెళితే మహిళలు ఇంటి వద్దనే ఉంటారు. గోదావరికి వరదలు వచ్చినప్పుడు వీరందరికీ నగరంలోని పునరావాస కేంద్రాలకు తీసుకువస్తారు. అయితే వీటిలో మహిళలు, పిల్లలను ఉంచి మగవారు మాత్రం లంకలకు వెళ్లిపోతారు. అక్కడ తమ పడవలు, ఇతర వస్తువులు గోదావరి వరదలో కొట్టుకుపోకుండా కాపాడుకుంటారు.



చందా సత్రంలో భోజనాలు చేస్తున్న లంక ప్రజలు

**సదుపాయాలు కల్పించాం**

చందా సత్రంలోనూ, అల్కాట్‌గార్డెన్స్‌లోని మున్సిపల్ కల్యాణ మండపంలోని లంక గ్రామాల్లోని ప్రజలను సురక్షితంగా తరలించాం. వీరికి కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. తాగడానికి వేడినీరు, వేడివేడిగా అన్నం ఏర్పాటు చేస్తున్నాం. అంతే కాకుండా మగవారికి, ఆడవారికి వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. వైద్యశిబిరాలను కూడా నిర్వహిస్తున్నాం.

– చైత్రవర్షిణి, రెవెన్యూ డివిజనల్ అధికారి, రాజమహేంద్రవరం

**సురక్షిత ప్రాంతాలకు తరలింపు**

గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక వెలువడగానే అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు మత్స్య, అగ్నిమాపక, రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం ఆధ్వర్యంలో లంక గ్రామాల్లోని కుటుంబాలను పునరావస కేంద్రాలకు తరలించారు. ఎటువంటి మానవ, పశువుల ప్రాణ నష్టం కలగకుండా నివారణ చర్యల్లో భాగంగా వారికి అవగాహన కల్పించి సురక్షితంగా పునరావాస కేంద్రానికి తరలించారు. నగరంలో చందా సత్రం, అల్కట్ గార్డెన్‌లోని మున్సిపల్ కల్యాణ మండపంలో తగిన మౌలిక సదుపాయాలు కల్పించి వారిని అక్కడకి చేర్చారు. బ్రిడ్జి లంక, ఎదుర్లమ్మలంక, కేతవారిలంకకు చెందిన సుమారు ఇప్పటి వరకు 260 మందికి పునరావాసం తరలించారు. చందా సంత్రంలో 198 మందికీ పైగా, మున్సిపల్ కల్యాణ మండపంలో సుమారు 60 మందిని ఉంచారు. కేతావారి లంక నుంచి ఇంకొందరిని తరలిస్తున్నారు.

### ముంపుబారిన పడిన పొలాల పరిశీలన


వెంకటనగరంలో పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

**రాజమహేంద్రవరం రూరల్:** మండలంలోని వెంకటనగరం, తొర్రేడు గ్రామంలో ముంపునకు గురైన వరిపొలాలను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నాట్లు వేసిన, పిలక దశలో ముంపునకు గురైతే వెంటనే నీటిని బయటకు తీసివేయాలన్నారు. తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. ఈ విధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుందని తెలిపారు. కుళ్లు తెగుళ్ల రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలన్నారు. రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి భీమరాజు, రైతులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ విధానాలపై బాబు గళం వినిపించాలి

**ప్రకాశం నగర్:** రాష్ట్ర ప్రజలకు కేంద్రం చేసే అన్యాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తన గళం వినిపించాల్సిన అవసరం ఉందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు ఆకుల వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అధిక ధరలు, అసమానతలు, పంటల గిట్టుబాటు ధరలు, రైతు రుణమాఫీ వంటివి దేశంలో ప్రధాన సమస్యలుగా ఉన్నాయని, వీటిపైన కేంద్రం దృష్టిసారించడం లేదని విమర్శించారు. ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై ముఖ్యమంత్రి చందబాబు కేంద్రాన్ని నిలదీయాలని కోరారు.

## పొంగిన ఆవ కాలువ.. వీధుల్లో చేరిన వరద

- బొమ్మూరు నేతాజీనగర్, హుకుంపేట సావిత్రినగర్ ప్రాంతాల మునక
- ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద తక్షణ చర్యలు చేపట్టిన అధికారులు


బొమ్మూరు నేతాజీనగర్‌లో నీటమునిగిన వీధులు


ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద భారీ మోటార్లతో మురుగునీటిని తోడుతున్న స్థానికులు

**రాజమహేంద్రవరం రూరల్:** గోదావరి వరద ఉధృతంగా ప్రవహించడంతో పాటు, రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో రాజమహేంద్రవరం నుంచి ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్దకు వెళ్లే ఆవకాలువ పొంగిపొర్లుతోంది. దీనివల్ల బొమ్మూరు గ్రామంలోని నేతాజీనగర్ 4, 7, 14, 15 వీధులు ముంపునకు గురయ్యాయి. హుకుంపేట గ్రామంలో సావిత్రినగర్ పలు వీధుల్లో ముంపునీరు రావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బొమ్మూరు, హుకుంపేట పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, గుంట్రువెంకటరావు సిబ్బందితో కాలువల వద్ద బ్లీచింగ్ చల్లించారు. రాజమహేంద్రవరం నుంచి హుకుంపేట, బొమ్మూరు గ్రామాల మీదుగా మురుగునీరు, వర్షపునీరు సాయిబాబాగుడి వద్ద గోదావరిలో కలుస్తుంది. అయితే గోదావరి వరద ఉధృతం, రెండో ప్రమాద హెచ్చరిక జారీచేయడంతో సాయిబాబాగుడి వద్ద గేట్లు మూసివేశారు. దీనివల్ల సాయిబాబాగుడి వద్ద నుంచి మురుగునీరు వెనక్కివ వస్తుండడంతో బొమ్మూరు, హుకుంపేట గ్రామాల్లోని వీధులు మునిగిపోతున్నాయి. చివరకు ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద ఇరిగేషన్ అధికారులు భారీ మోటార్లు ఏర్పాటు చేసి మురుగు నీటిని గోదావరిలోకి తోడడంతో కొంతమేర ఊరట కలిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**నీటిలోనే 1260 ఎకరాల పంటపొలాలు**

మండలంలోని 1260 ఎకరాలు వరిపంట పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. జల్ల కాలువ వలన తొర్రేడులో 440 ఎకరాలు, కోలమూరు 257 ఎకరాలు, కాతేరు, వెంకటనగరంలో 442 ఎకరాలు, ఆవకాలువ వలన హుకుంపేటలో 50 ఎకరాలు, బొమ్మూరులో 50 ఎకరాలు, ధవళేశ్వరంలో 21 ఎకరాలు నీటమునిగాయని మండల వ్యవసాయాధికారి భీమరాజు తెలిపారు.

## ఢిల్లీ ధర్నాలో జిల్లా నేతలు


ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఉభయగోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్

**రాజమహేంద్రవరం సిటీ:** తెలుగుదేశం పార్టీ నేతలు రాష్ట్రంలో సాగిస్తున్న దాష్టీకాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో బుధవారం తలపెట్టిన సమర శంఖానికి తూర్పుగోదావరి జిల్లా నుంచి పలువురు నేతలు తరలి వెళ్లి సంఘీభావం ప్రకటించారు. మాజీ ఎంపీ మార్గాని భరత్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పార్టీ యువజన విభాగం గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, పార్లమెంటు, అసెంబ్లీనియోకవర్గాల కోఆర్డినేటర్‌లు గూడూరి శ్రీనివాస్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

## కారాగారాన్ని సందర్శించిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు


సెంట్రల్‌జైలును సందర్శించిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

**కంబాలచెరువు:** ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల(ఆర్ట్స్ కళాశాల)లోని సోషల్ వర్క్, రాజనీతి శాస్త్ర విభాగాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా రాజమండ్రి సెంట్రల్ జైలును సందర్శించారు. రాజనీతి శాస్త్రం విభాగ అధ్యాపకులు సైయ్యద్ ఫర్హా, సీతా మహాలక్ష్మి, రాణి విద్యార్థులకు సెంట్రల్ జైలులో వాతావరణాన్ని క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎస్.రాహుల్, డీఎస్పీ ఎస్.ఎం.రవికుమార్ మాట్లాడుతూ ఈ జైలులో మొత్తం 1301 మంది ఖైదీలు ఉంటున్నారని, వారిలో ముగ్గురు సభ్యులు విదేశీ ఖైదీలని, వారిలో ఒకరికి శిక్ష విధించగా, మిగిలిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సెంట్రల్ జైలును 1864లో డచ్‌లు నిర్మించారని, ఆ తర్వాత బ్రిటీషర్లు దానిని ఆయుధ నిల్వలుగా మార్చారని, తరువాత సెంట్రల్ జైలుగా మార్పు చెందిందన్నారు. 1974లో చివరిరిగా ఉరిశిక్ష వేశారని విద్యార్థులకు తెలిపారు. ఒకేసారి ఇద్దరిని ఉరితీసే అవకాశం ఉన్న ఏకైక జైలు ఇది అని సెంట్రల్ జైలు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. సమాజంలోని పరిపాలన విధి విధానాల గురించి తరగతి గదుల్లో చదువుకున్న దాని కంటే ఇలాంటి క్షేత్ర పర్యటన ద్వారా నిజమైన అనుభూతిని పొందుతున్నామని విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి క్షేత్ర పర్యటనను ఏర్పాటు చేసినందుకు కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్.కె.అధ్యాపకులను అభినందించారు.

### ఆకలి, అసమానతలే జాషువా కవితలు

**ప్రకాశం నగర్:** ఆకలి, అసమానతలే జాషువా కవితలని, జీవిత కాలం పోరాటం చేసిన కవి యోధుడు గుర్రం జాషువా అని నన్నయ్య విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు టి.సత్యనారాయణ అన్నారు. బుధవారం కళాగౌతమి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ సంయుక్త నిర్వహణలో జాషువా వర్ధంతిని నిర్వహించారు. ఈ సభకు సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా ఏయే సామాజిక రుగ్మతలను తన కవిత్వం ద్వారా విమర్శకు ఎక్కు పెట్టారో అవి ఇప్పుడు కూడా రూపం మార్చుకొనిగానీ కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎబిల్ రాజబాబు మాట్లాడుతూ, ఆధునిక కవులలో వాస్తవ ప్రపంచ సంచారి జాషువా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖధిపతి పీవీ సంజీవరావు, తెలుగు అధ్యాపకులు ఎస్.రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో స్వచ్ఛంద సంస్థలు

- లక్ష్మీశ్రీనివాస్ ట్రస్ట్‌ను ప్రారంభించిన డాక్టర్ గుబ్బల రాంబాబు


రక్తదానం శిబిరంలో పాల్గొన్న గుబ్బల రాంబాబు

**రాజమహేంద్రవరం సిటీ:** సమాజ అవసరాలు తీర్చేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ఎంతగానో కృషి చేస్తున్నాయని, ప్రజల అవసరాలు తీర్చడానికి మరిన్ని సేవా సంస్థలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక జేఎన్ రోడ్‌లోని జీఎస్కేఎం లా కాలేజీలో జరిగిన లక్ష్మీశ్రీనివాస్ ట్రస్టును రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మొదటి కార్యక్రమంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కూడా రాంబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగర ప్రజల అవసరాలు తీర్చడానికి మరిన్ని సేవా సంస్థలు రావాలన్నారు. యువకుడైన శరత్‌కృష్ణ తల్లిదండ్రుల పేరున ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేయాలనుకోవడం అభినందనీయమన్నారు. మొదటి కార్యక్రమంగా జక్కంపూడి వైఎస్సార్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన శరత్‌కృష్ణను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షురాలు పి.లక్ష్మీశ్రీనివాస్, ప్రిన్సిపాల్ కే మధుసూదనరావు, లక్ష్మణరావు, బోడా సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఏపీపై ప్రత్యేక దృష్టి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొమ్ముల దత్తు

**రాజమహేంద్రవరం సిటీ:** కేంద్ర బడ్జెట్‌లో ప్రధాని మోదీ, మంత్రి నిర్మల సీతారామన్ ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక దృష్టి సారించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు సమకూర్చుతామని ప్రకటించడం అద్భుతమైన విషయమని, ఏపీ ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం నిర్మాణం పూర్తి చేస్తానని ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. 8 వెనుకబడిన జిల్లాలకు 50 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి, సంక్షేమం దిశగా దూసుకుపోతోందని దీనిలో భాగంగా మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. రాష్ట్రం నుంచి వెళ్లే జీఎస్టీ ఇతర పన్నుల ద్వారా సుమారు రూ.50 వేల కోట్లు ఏపీకి తిరిగి వచ్చే అవకాశం ఉందని, బీజేపీని ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు గుర్తించినందుకు ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. రైల్వే జోన్‌కు గత ప్రభుత్వం స్థలం కేటాయించకపోవడంతో జోన్ ఏర్పాటు సాధ్యం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రేలంగి శ్రీదేవి, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కడియం:** వేమగిరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. వేమగిరి, కడియం, కడియపుసావరం, జేగురుపాడు గ్రామాలకు సరఫరా ఉండదని తెలిపారు.

## 28న శెట్టిబలిజ ఉచిత వివాహ పరిచయ వేదిక


సమావేశంలో మాట్లాడుతున్న రామారావు తదితరులు

**సీటీఆర్ఐ:** శెట్టిబలిజల కోసం ఈనెల 28వ తేదీన రాజమండ్రిలో శెట్టిబలిజ ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర శెట్టిబలిజ సంఘం ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అన్నారు. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 28న ఉదయం 10 గంటల నుంచి ఆల్కాట్ తోట గేదెల నూకరాజు ఏసీ కల్యాణ మండపంలో ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామని, యువతి యువకులు, వారి తలిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2007 నుంచి ప్రతి సంవత్సరం శెట్టిబలిజ ఉచిత వివాహ పరిచయ వేదిక విజయవంతంగా నిర్వహించి ఎంతో మంది యువతీ యువకులు ఈ వేదిక ద్వారా వివాహబంధంతో ఒక్కటయ్యారని వివరించారు. వివాహ పరిచయ వేదికకు హాజరయ్యే యువతీయువకులు, తలిదండ్రులు కార్డుసైజు ఫొటోలు, బయోడేటా తీసుకుని రావాలని సానబోయిన రామారావు సూచించారు. ఇతర వివరాలకు సెల్ నెంబరు 9247864443, ఆర్గనైజింగ్ కమిటీలోని మట్టపర్తి సత్యనారాయణ 9398925726 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఉచిత వివాహ పరిచయ వేదిక కోసం ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీలో మేడిశెట్టి తాతాబ్బాయి, గుబ్బల ఉదయభాస్కర్, బొక్కా సత్య వెంకట ప్రతాప్, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, లావేటి సత్యనారాయణ ఉన్నారని సానబోయిన రామారావు వివరించారు.

## సత్యదేవ నర్సరీని సందర్శించిన రైతులు



సత్యదేవ నర్సరీని సందర్శించిన రైతులు, అధికారులు

**కడియం:** కడియపులంకలోని సత్యదేవ నర్సరీని మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన పలువురు రైతులు బుధవారం సందర్శించారు. వివిధ రకాల మొక్కల పెంపకాన్ని గురించి రైతులు పుల్లా చంటియ్య, పెద సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. అటల్ బుజ్‌బల్ యోజన పథకం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నర్సరీల సందర్శనకు విచ్చేసినట్లు వారు తెలిపారు. డీపీవో షేక్ మహబూబ్ వలీ, డీడీహెచ్ శ్రీనివాసులు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన ఉద్యాన, నీటి పారుదల, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు ఈ బృందంలో ఉన్నారు.